క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభ

రామాపురం : గ్రామాలలో ఇటీవల జరిగిన రీ సర్వేతో ఏర్పడిన భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభ ఏర్పాటు చేశామని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని సుద్దమళ్ల గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో గ్రామంలో 3333.04 ఎకరాల భూమిని రీ సర్వే చేశామన్నారు. ఈ రీ సర్వే వల్ల గ్రామస్తులకు ఎలాంటి భూ సమస్యలు ఉన్నా సభ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీ వద్ద కలకలం!



కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల వద్ద పూజాసామగ్రి

సుండుపల్లె : మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల వద్ద కలకలం రేగింది. శనివారం ఉదయం పాఠశాల వద్ద ప్రధాన రహదారిపై పసుపు, కుంకుమ, వేపమండలు, పగిలిన టెంకాయ చిప్పలు తదితరాలు కనిపించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఆందోళన అలుముకుంది. అసలు ఇక్కడ పూజలు చేయాల్సిన అవసరం ఏముందన్న అనుమానాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా దురుద్దేశ్యంతో ఇలా చేశారా అన్న భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులు, పోలీసులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

ఈఓపీఆర్డీగా సురేష్



సంబేపల్లె : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఈఓపీఆర్డీగా సురేష్‌బాబు బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా కేంద్రం నుంచి బదిలీపై సంబేపల్లె మండలానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

రూ. 50 లక్షలతో సిమెంట్ రోడ్లకు భూమిపూజ



సిమెంట్ రోడ్లకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

చిట్వేలి : నగిరిపాడు పంచాయతీలో శనివారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు భూమి పూజ చేశారు. పంచాయతీలోని వెంకట్రాజుపేట, ఉప్పరపల్లి, ఎగువపల్లి, వెంకట్రాజుపల్లి హరిజనవాడలలో సిమెంటు రోడ్లు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఈఓను కలిసిన వ్యాయామ ఉపాధ్యాయులు



డీఈఓకు శుభాకాంక్షలు తెలుపుతున్న వ్యాయామ ఉపాధ్యాయులు

రాయచోటి (జగదాంబసెంటర్) : అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యంను ఏపీ పీఈటీస్ అండ్ ఎస్ఏ పీఈటీ అసోసియేషన్ సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. పదోన్నతిపై డీఈఓగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, జిల్లాలోని పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళవాయిపల్లి పాఠశాలలో కిచెన్ గార్డన్



కిచెన్ గార్డెన్ కార్యక్రమంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పుల్లంపేట : మండలంలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం సృజన, నో బ్యాగ్ డేలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి కిచెన్ గార్డన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని కొద్దిపాటి స్థలాన్ని చదును చేసి మెత్తటి మట్టిని విత్తనాలు నాటడానికి అనుగుణంగా గట్టుగా చేసి వివిధ కూరగాయలు, ఆకుకూరలు, మొక్కలను నాటారు. ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ ఇలా కిచెన్ గార్డన్ ఏర్పాటు వల్ల పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం పట్ల అవగాహన కలిగి ఇంటిలో ఇలా చిన్నచిన్న మొక్కలు పెంచడం అలవాటు అవుతుందన్నారు. అలాగే వ్యవసాయం పట్ల మంచి అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయ పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో కపర్దీశ్వర స్వామి

- కార్తీక మాసంలో ప్రత్యేక శోభ
- భారీగా తరలిరానున్న భక్తులు



కపర్దీశ్వరస్వామి మూల విరాట్



కపర్దీశ్వర స్వామి ఆలయం

సిద్దవటం : సిద్దవటం గ్రామ శివారులోని లంకమల్లేశ్వర అభయారణ్యంలో వెలసిన కపర్దీశ్వర స్వామి ఆలయం ప్రకృతి రమణీయత మధ్య శోభిల్లుతోంది. సిద్దవటం–బద్వేలు ప్రధాన రహదారి నుంచి లంకమల్లేశ్వర అభయారణ్యంలోకి కిలో మీటరు దూరంలో ఈ ఆలయం వెలసింది. సందర్శకుల సంఖ్య పెరుగుతుండటంతో ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది.

ఆలయ విశిష్టత

పురాతన కాలంలో పరిక్షిత్తు మహారాజు కుమారుడు జనమేజయుడు దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాలలో శివలింగాలు ప్రతిష్టించారు. అందులో భాగంగా శ్రీ నిత్యపూజస్వామి, లంకమల్లేశ్వర స్వామి, కపర్దీశ్వర స్వామి ఆలయాలలో శివలింగాలను ప్రతిష్టించినట్లు ఇక్కడి పూర్వీకుల నమ్మకం. కపర్దీశ్వర స్వామి ఆలయంలో శివలింగం, నందీశ్వరుడు, అక్కదేవతలు, నాగమల్లేశ్వరుని పుట్ట వెలిశాయి. ఆలయ సమీపంలో నీటి గుండాలు కూడా ఉన్నాయి. ఇక్కడి సమీపంలోని ఇదే అరణ్యంలో శ్రీ నిత్యపూజ స్వామి ఆలయం వరకు 101 నీటి గుండాలు ఉన్నట్లు చెబుతారు. నీటి గుండాలలో స్నానం చేసిన తరువాత భక్తులు మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. ఆలయంలో కార్తీక మాసం, మహా శివరాత్రి ఉత్సవాల సందర్భాలలో ఇక్కడి భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మహిళలు సంతానం కోసం ఆలయం పక్కనున్న నాగమల్లేశ్వరుని పుట్ట మీద ఉన్న చెట్టుకు జోలెలు కడుతూ ఉంటారు. ప్రతి సోమవారం ఆలయంలో సిద్దవటం, అట్లూరు, కడప, ఒంటిమిట్ట ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివారికి పూజలు చేస్తుంటారు. అంతేగాకుండా కార్తీక పౌర్ణమి రోజున ఆలయం ఆవరణం అంతా మహిళా భక్తులు కార్తీక దీపాలను వెలిగిస్తారు. మహా శివరాత్రి పర్వదినాన పార్వతీ పరమేశ్వరులకు కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. తరువాత స్వామి వారిని పల్లకిలో ఊరేగిస్తారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, రాత్రి వేళ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఇక్కడ ఆలయం కొండ కోనల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండటంతో ఈ ఆలయాన్ని దర్శించేందుకు భక్తులు విశేషంగా తరలి వస్తుంటారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

ఓబులవారిపల్లె : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం అవసరమని రైల్వేకోడూరు జూనియర్ సివిల్ జడ్జి పి.జె. తేజ సాయి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో విధాన్ సే సమాధానం, జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ సమాజంలో మహిళ తన కుటుంబాన్ని, పిల్లలను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దేందుకు చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు. అలాంటి మహిళలకు న్యాయం, చట్టంపై అవగాహన అవసరమన్నారు. అంతేకాకుండా వారి హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. రీసోర్స్ పర్సన్, న్యాయవాది అంబిక మాట్లాడుతూ సమాజంలో మహిళలు, చిన్నపిల్లలపై అరాచకాలు అధికమయ్యాయన్నారు. ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే 15100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. వరకట్నం వేధింపులు, గృహహింస తదితర వాటికి సంబంధించి ఎలా న్యాయం పొందాలి అన్న విషయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి పీజే తేజసాయి

విద్యా సామగ్రి పంపిణీ

సంబేపల్లె : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వెటర్నరీ అసిస్టెంట్ ప్రసన్న ఆర్థిక సహాయంతో శనివారం విద్యాసామగ్రిని మండల విద్యాశాఖాధికారి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, ఊరికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

ఉపాధ్యాయులకు ఇంటి స్థలాలు కేటాయించండి



ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

పుల్లంపేట : పుల్లంపేట మండలంలో అనువైన ప్రదేశం గుర్తించి ఉపాధ్యాయులకు టీచర్స్ కాలనీ ఏర్పాటు చేసి ప్రభుత్వ ధరకు ఇంటి స్థలాలు కేటాయించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు సంఘం మండల అధ్యక్షుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, జిల్లా కౌన్సిలర్ బాల నరసింహులు, సీనియర్ ఎస్టీయూ నాయకుడు రమణారెడ్డి రైల్వేకోడూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రూపానందరెడ్డిని, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను వారు శనివారం కలిసి విన్నవించారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను వారు శాలువాతో సత్కరించారు.

కరువు రైతులను ఆదుకోండి

రామాపురం : కరువులో రైతులను ఆదుకోవాలని మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ సభా భవనంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాలుగా మండలంలో వర్షాలు లేక వేరుశనగ, వరి, ఇతర వాణిజ్య పంటలు రైతులు సాగు చేయలేకపోయారన్నారు. ఏ నెలలో కూడా సగటు వర్షపాతం లేకపోవడం ఇందుకు కారణమన్నారు. మండలంలో 13 గ్రామ పంచాయతీలలో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఉలవ పంటను ప్రత్యామ్నాయ పంటగా సాగు చేశారన్నారు. ప్రభుత్వం రాయచోటి నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం హర్షణీయమన్నారు. అందరికీ ఉపాధి పనులు ముమ్మరంగా కల్పించి రైతులను, కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. పంట నష్టం, బీమా రైతులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జాషువా, సర్పంచ్‌లు నాగభూషణ్‌రెడ్డి, సరోజమ్మ, ఆంజనేయులు, మునీర్, వెంకటరెడ్డి, రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యులు మాలా, తులసి, మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

సుండుపల్లె : మండల విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను, మాధురీ పాఠశాలను, దారుల్ హుదా పాఠశాలను రాయచోటి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి శివ ప్రకాష్ రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అపార్ ఐడీ జనరేట్ చేయడం, సీసీ మార్క్స్ నమోదును పరిశీలించారు. పాఠశాలలో సిబ్బందికి అపార్ నమోదు చేయడంలోనూ, మార్కులు నమోదు చేయడంలో పలు సూచనలు, సలహాలు చేశారు. అలాగే క్షుద్రపూజలు అంటూ వచ్చిన వార్తకు స్పందిస్తూ ఎస్ఐ ఎం.శ్రీనివాసులు పాఠశాలను సందర్శించి మూఢ నమ్మకాలపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-2 రవీంద్ర నాయక్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ ముబారక్, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శివ శృతి, సీఆర్పీలు గంగయ్య, ఖదిరున్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

సంబేపల్లె : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. మండల కేంద్రంలోని వడ్డెపల్లె రోడ్డు మరమ్మతు పనులను వారు ప్రారంభించారు. ముందుగా మండలంలోని గురిగింజకుంట, దుద్యాల గ్రామాలలో మంత్రి పర్యటించి గ్రామ సభలలో ప్రజల సమస్యలపై ఆరా తీశారు. మండల కేంద్రంలోని పాండురాజుల బండపై నీటి సమస్య ఉందని మహిళలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

పంటల బీమా పథకంపై శిక్షణ

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ డివిజన్ పరిధిలోని లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు, వీరబల్లి మండలాలకు సంబంధించిన రైతు సేవా కేంద్ర సిబ్బందికి, వ్యవసాయశాఖ అధికారులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ సహాయ వ్యవసాయ సంచాలకుడు మస్జీద్ అహ్మద్ మాట్లాడుతూ ప్రస్తుతం రబీ సీజన్‌లో, రాబోయే ఖరీఫ్ 2025, రబీ 2025-26 సీజన్లకు సంబంధించి పంటల బీమా పథకంపై ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. దీని ప్రకారం పంటల బీమా కోసం రైతులే స్వయంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు జయరాణి, వ్యవసాయ అధికారి రమేష్ రాజు, జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి రామకృష్ణమరాజు, లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ అధికారి కె.రమేష్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఓలతో సమావేశం

సుండుపల్లె : మండల పరిధిలో సాగునీటి సంఘం ఎన్నికలు జరిపేందుకు తహసీల్దార్ దైవాదీనం, జల వనరులశాఖ ఏఈ నాగేంద్ర నాయక్ శనివారం వీఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ నాగేంద్ర నాయక్ మాట్లాడుతూ పింఛా ప్రాజెక్టు, నారాయణరెడ్డి చెరువు, ఊట చెరువు, గూనేటివాగు చెరువు, కృష్ణారెడ్డి చెరువుల పరిధిలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

వంతాటిపల్లె రైతుసేవా కేంద్రం ఆకస్మిక తనిఖీ



సిద్దవటంలో పురుగుల మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ నాగరాజు

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె రైతుసేవా కేంద్రాన్ని శనివారం బద్వేల్ ఏడీఏ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టంపై రైతుల తుది జాబితాపై సామాజిక తనిఖీ చేపట్టామన్నారు. వంతాటిపల్లె బూసి రాజశేఖర్‌రెడ్డి అనే రైతు వరి పొలంలో ఎకరాకు 38 బస్తాల దిగుబడి నమోదు చేశామన్నారు. ప్రస్తుత మార్కెట్ ధరలు కనీస మద్దతు ధరలపై ఆరా తీశామన్నారు. తరువాత సిద్దవటంలోని శ్రీ వెంకటేశ్వర పెస్టిసైడ్స్ దుకాణాన్ని తనిఖీ చేసి రిజిస్టర్‌లు, బిల్లు బుక్కులు, లైసెన్స్ గడువు తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. నాణ్యమైన పురుగు మందులను మాత్రమే అమ్మాలని, రసీదులు తప్పకుండా ఇవ్వాలని సూచించామన్నారు. గ్లైఫోసెట్ అనే నిషేధిత కలుపు మందును విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకుడు ప్రేమ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఈనెల 5న పీడీఎస్‌యూ సభలు



పోస్టర్లను విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

రాయచోటి అర్బన్ : ఈనెల 5వ తేదీన విజయవాడ నగరంలో పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న తెలిపారు. శనివారం పట్టణంలోని మాసాపేటలో ఆయన ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ విద్య, సమసమాజ స్థాపన లాంటి ఉన్నతమైన ఆశయాల కోసం పోరాడుతున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. పీడీఎస్‌యూ అన్నమయ్య జిల్లా నాయకులు మహబూబ్‌బాషా, రెడ్డిప్రసాద్, గణేష్, శివసాయి, సాజిద్, రవీంద్ర, భాస్కర్, సుబ్రమణ్యం, సుబ్బరాయుడు, అంజి, శివకేశవ, మహేష్ పాల్గొన్నారు.

బస్టాండులో గుంతలు పూడ్చివేత



గుంతలను కంకర పొడితో పూడ్చిన దృశ్యం

చిన్నమండెం : కడప–బెంగళూరు జాతీయ రహదారి చిన్నమండెం మండల కేంద్రంలో గుంతలను ఎట్టకేలకు పూడ్చారు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ సుధామాధురి గుంతలను పూడ్చాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన సంబంధిత అధికారులు బస్టాండులో ఏర్పడ్డ గుంతలను కంకర పొడితో పూడ్చారు. అయితే త్వరలోనే సిమెంట్‌తో కాంక్రీట్ వేసి గుంతలను పూర్తిగా పూడ్చి వేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి అంచనాలను ఉన్నతాధికారులకు నివేదించినట్లు అధికారులు తెలుపుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు బస్టాండు గుంతలమయంగా మారింది. దీంతో ఇప్పుడు ఆ గుంతలను అధికారులు పూడ్చటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీరభద్ర స్వామి ఆలయంలో బహిరంగ వేలం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆలయ సిబ్బంది

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి తెలిపారు. ఆలయంలో విభూది పండు, దారాలు, కొబ్బరికాయలు అమ్ముకొనే హక్కు కోసం ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎలక్ట్రికల్ సామాన్లు సరఫరా చేసే హక్కు, ఆలయానికి సంబంధించిన గదులలో సీసీ కెమెరాలు 32, డీవీఆర్, కేబుల్ వైర్లు ఏర్పాటుకు కూడా వేలం పాట నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ వేలం పాట ఈనెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు ఆలయంలో ఉంటుందన్నారు. సీల్డ్ కవర్ల ద్వారా వచ్చిన వాటినే స్వీకరించి వేలం నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి గల వారు ఈ వేలం పాటలో పాల్గొనచ్చన్నారు.

ఆలయంలో అన్న ప్రసాదం

ఆలయానికి వచ్చే భక్తుల కోసం శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానం కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజూ మూడు పూటలా అన్నప్రసాదం అందజేస్తున్నట్లు ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి తెలిపారు. ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తున్నట్లు చెప్పారు.

సమన్వయంతోనే మండల అభివృద్ధి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ గల్లా పద్మావతమ్మ తదితరులు

గాలివీడు : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ గల్లా పద్మావతమ్మ పేర్కొన్నారు. శనివారం ఎంపీపీ సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశానికి అధ్యక్షతన వహించి ఆమె మాట్లాడారు. ప్రభుత్వం గాలివీడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. మండల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించుకోవాలన్నారు. అప్పుడే మండలం అభివృద్ధి చెందుతుందన్నారు. మండల ఉపాధ్యక్షుడు మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డి, గాలివీడు సర్పంచ్ మిట్టపల్లె లక్ష్మీదేవమ్మలు మాట్లాడుతూ మండలంలో హౌసింగ్ పథకానికి సంబంధించిన బిల్లులను వెంటనే లబ్ధిదారులకు చెల్లించాలని, ఉపాధి కూలీలు ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని సభ దృష్టికి తెచ్చారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టి పరిష్కరించాలన్నారు. ప్రతి శాఖకు సంబంధించిన అధికారి కూడా గ్రామాల్లో ప్రభుత్వ విధి విధానాలను అమలు చేస్తూ ప్రజలకు తగిన న్యాయం చేయాలని సూచించారు. వైద్య, విద్య, విద్యుత్, సాంఘిక, అంగన్వాడీల పనితీరుపై సంబంధిత అధికారులు తమ పనితీరును తెలియజేశారు. విద్యుత్, రెవెన్యూ అధికారులు సభకు హాజరు కాకపోవడంపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మంచంపట్టిన పల్లెలు

- చికున్ గున్యా, టైఫాయిడ్ జ్వరాలతో అల్లాడుతున్న గ్రామీణులు
- పాఠశాలల్లోనూ పడకేసిన జ్వరాలు
- పల్లెల వైపు చూడని వైద్య సిబ్బంది



బిల్డింగ్ ఎస్సీ కాలనీలో జ్వరంతో మంచం ఎక్కిన మహిళ



జ్వరంతో ఆసుపత్రిలో చేరిన కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులు



బిల్డింగ్ ఎస్సీ కాలనీలో జ్వరంతో బాధపడుతూ..

లక్కిరెడ్డిపల్లి : సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాల్సిన వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు విపరీతమైన జ్వరాలతో మంచం పట్టారు. దోమల బెడద కారణంగా చికున్ గున్యా, టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు అధికమై గ్రామీణ ప్రాంత ప్రజలు ఆసుపత్రులపాలవుతున్నారు. మండలంలో కోనంపేట, దేవలంపల్లి పీహెచ్‌సీలతోపాటు లక్కిరెడ్డిపల్లెలో సీహెచ్‌సీ స్థాయి ఆసుపత్రులు అందుబాటులో ఉన్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందించాల్సిన వైద్య సిబ్బంది వారికి ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తుండటంతో గ్రామస్థాయిలో ఆశా కార్యకర్తలు ఇచ్చే మందులను వాడుతూ మంచం ఎక్కుతున్నారు. ఎక్కడ కూడా వైద్యులచే ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. మండలంలోని మద్దిరేవుల గ్రామం, బిల్డింగ్ ఎస్సీ కాలనీకి చెందిన ప్రజలు చికున్ గున్యా, టైఫాయిడ్ జ్వరాలతో మంచాన పడి నడవలేని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. కాళ్లు, చేతులు వాపులు రావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలతోపాటు పండు ముదుసలి వరకు జ్వరాలబారిన పడి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తూ వేలకువేలు ఖర్చు చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. కస్తూర్బా గాంధీ పాఠశాలతోపాటు వెలుగు పాఠశాలకు చెందిన విద్యార్థినులు జ్వరాల బారిన పడి లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. నాలుగైదు రోజులుగా జ్వరాలు తీవ్రతరమై పలు విద్యార్థినులకు వాంతులు, విరేచనాలు అవుతుండటంతో శనివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వైద్యం కోసం ఆయా పాఠశాలల సిబ్బంది తీసుకొచ్చారు. చాలా గ్రామాలలో జ్వరాల బారిన పడిన వారు స్థానిక ప్రథమ చికిత్స కేంద్రాలను ఆశ్రయించడంతో రక్త కణాలు తగ్గి సుదూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా వైద్య సిబ్బంది జ్వరం పట్టిన పల్లెలను గుర్తించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉంది.

వారం రోజులుగా నా కుమారుడికి జ్వరం తగ్గలేదు



వారం రోజులుగా నా కుమారుడికి జ్వరం వచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి వస్తూనే ఉన్నాను. ఇక్కడ సూదులు వేయడానికి కూడా రెండు గంటలు నిలబడాల్సి వస్తోంది. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాలంటే వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. వైద్య సిబ్బంది గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు, మాత్రలు ఇవ్వాలి.

– రమణ, రెడ్డివారిపల్లి, మద్దిరేవుల గ్రామం, లక్కిరెడ్డిపల్లి మండలం

కీళ్ల జ్వరాలు ఎక్కువై నడవలేకున్నాము



పది రోజులుగా మా ఊరిలో ప్రతి ఇంట్లో కీళ్ల జ్వరాలు ఎక్కువైపోయి నడవలేక కట్టెల సాయంతో నడుస్తూ ఉన్నాము. ఆశా కార్యకర్త తప్ప వైద్యులు మా పల్లెకు వచ్చిన పాపాన పోలేదు. చిన్న పిల్లలు మొదలుకొని ముసలివారి వరకు జ్వరాలతో ఇబ్బంది పడుతున్నాము. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి చూపించుకొని వేలకు వేలు డబ్బులు ఖర్చు చేసుకుంటూ ఉన్నాము. మాకు ప్రభుత్వ వైద్యులు ఉచిత మందులు ఇచ్చి ఆదుకోవాలి

– కత్తి నాగలక్షుమ్మ, బిల్డింగ్ ఎస్సీ కాలనీ, మద్దిరేవుల గ్రామం, లక్కిరెడ్డిపల్లి మండలం.

నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాను



నాలుగు రోజులుగా జ్వరం వస్తూనే ఉంది. మా పాఠశాలలో మాత్రలు ఇచ్చారు. రోజురోజుకు జ్వరం ఎక్కువై ఇబ్బంది పడుతూ ఉంటే అందరితో పాటు నేను ఆసుపత్రికి వచ్చాను. నడవలేకున్నాను. నాతోపాటు చాలా మంది జ్వరాలతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చాము.

– అంజలి, 7వ తరగతి విద్యార్థిని, కస్తూర్బా గాంధీ పాఠశాల, లక్కిరెడ్డిపల్లి మండలం.